క్లుప్తంగా

లక్ష్మీ నరసాపురంలో రేపు జాబ్ మేళా

పెదపూడి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం గ్రామంలోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ జూనియర్ కళాశాలలో రేపు జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు తూర్పు గోదావరి జిల్లా ఉపాధి సంస్థ అధికారి హరీష్ చంద్ర ప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పేరుమాళ్‌రావు ఒక ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో రెండు ప్రముఖ కంపెనీలు హాజరవుతాయన్నారు. వివిధ ఉద్యోగాల్లో పని చేయడానికి పదో తరగతి, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ, ఎం ఫార్మసీ, డిగ్రీ పూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు గల వారు అర్హులన్నారు. అభ్యర్థులకు ఇంటర్వ్యూలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. వివరాలకు 9988853335, 8712655686 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పరశురామావతారంలో భజే నారాయణస్వామి


పరశురామావతారంలోని భజే నారాయణ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రంగంపేట: మండలంలోని వడిశలేరు గ్రామంలో వేంచేసి యున్న భజే నారాయణస్వామి వారి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకొని దశావతారాల్లో భాగంగా సోమవారం స్వామి వారిని పరశురామావతారంలో అలంకరించారు. ఆలయ అర్చకుడు చిలకమర్రి మురళీకృష్ణ మాచార్యులు, శ్రీనివాసాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మంగళవారం రామావతారంలో స్వామివారు దర్శనమిస్తారని ఆలయ కార్య నిర్వాహక కార్యదర్శి పి.ప్రియాంక తెలిపారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


జి.మామిడాడలో వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేక పూజలు చేస్తున్న అర్చకులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన అలమేలు మంగ, పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామి వారికి స్వప్న ఉత్సవం, మూల విరాట్లకు పంచామృతాభిషేకాలు, హోమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నల్లమిల్లి సూర్యనారాయణరెడ్డి, అతని కుమారుడు ఏర్పాట్లు చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కొవ్వూరు అప్పారెడ్డి, మల్లిడి శ్రీనివాస్‌రెడ్డి, కర్రి సుధాకర్‌రెడ్డి, గోపికృష్ణారెడ్డి, అరవెల్లి రఘు రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహస్వామి హుండీ ఆదాయం లెక్కింపు


లక్ష్మీ నరసింహస్వామి హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఈఓ, సర్పంచి తదితరులు

పెదపూడి: పుట్టకొండ గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక హుండీ ఆదాయం రూ.1,01,381 వచ్చినట్లు ఆలయ ఈఓ వద్దాది సత్యానారాయణ తెలిపారు. ఆలయంలో స్వామివారి హుండీ ఆదాయం లెక్కింపును దేవదాయ ధర్మాదాయ శాఖ గంగ్రేడు గ్రూప్ ఈఓ డీ.శ్రీనివాస్ పర్యవేక్షణలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పీఏ అనంతాచార్యులు, గ్రామ సర్పంచి వల్లు వెంకటరమణ, జి.సత్యవతి, వై.భద్రం, తిబిరిశెట్టి వీర ఫణీంద్ర, ఎలుబండి శ్రీను, అర్చకుడు పీఏ గోపాచాలర్యులు పాల్గొన్నారు.

11న ముగ్గుల పోటీలు

రాజానగరం: సంక్రాంతి సంబరాలలో భాగంగా స్థానిక జీఎస్‌ఎల్ వైద్య కళాశాల క్యాంపస్‌లో ఈ నెల 11న ముగ్గుల పోటీలు జరగనున్నాయి. ఇదే క్యాంపస్‌లోని హెబిటేట్ రెస్టారెంట్ సహకారంతో నిర్వహించే ఈ పోటీలలో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.80 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.40 వేలు, తృతీయ బహుమతిగా రూ.20 వేలు విలువ చేసే వెండి ఆభరణాలను అందజేస్తారు. ఆసక్తి ఉన్న మహిళలు ఈ నెల 9వ తేదీ లోపు రూ.వంద ఎంట్రీ ఫీజుగా చెల్లించి, పేర్లు నమోదు చేసుకోవాలని రెస్టారెంట్ మేనేజర్ భీమ్ సేనారెడ్డి తెలిపారు.

పేదింట చదువుల భారం..!

- ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం విద్యార్థుల ఎదురుచూపులు
- ఫీజులు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్న కళాశాలల యాజమాన్యాలు
- స్పందించని కూటమి ప్రభుత్వం
- విద్యాభివృద్ధికి చేయూత నిచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- విద్యా దీవెన, వసతి దీవెనతో ఆర్థిక సాయం


ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు, విద్యార్థులు (ఫైల్)

రంగంపేట: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, అగ్రవర్ణ పేద విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం లేకుండా ఆర్థిక సాయాన్ని సకాలంలో అందజేస్తూ భరోసా కల్పించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటుతున్నా విద్యార్థులు ఫీజు రీయంబర్స్‌మెంట్ కోసం ఎదురు చూపులు చూడాల్సిన దైన్య స్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఆర్థిక సాయాన్ని ఎప్పుడు విడుదల చేస్తుందో తెలియని అయోమయంలో విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. మరోపక్క కళాశాలల్లో ఫీజులు చెల్లించమని యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నారు. ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తుందో లేదో తెలియక విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో లబ్ధి

పేద విద్యార్థుల ఉన్నత చదువులకు భరోసా కల్పించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాల ద్వారా ఆర్థిక సాయం అందించేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చదువులకు ఆటకం లేకుండా ఏటా క్రమం తప్పకుండా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవి. పూర్తి ఫీజు రీయంబర్స్‌మెంట్‌తో పాటు జగనన్న వసతి దీవెన కింద పది వేల నుంచి ఇరవై వేల రూపాయల వరకు ఆర్థిక సాయం అందించేది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, ఈబీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులకు అర్హతే కొలమానంగా ఉన్నత చదువులకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తూ వచ్చింది.

సత్వర చెల్లింపులు

గత ప్రభుత్వం డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్, పోస్టు గ్రాడ్యుయేషన్ వంటి కోర్సులకు ఒక్కపైసా ఖర్చు లేకుండా గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో చదువుకునే అవకాశం కల్పించింది. పేద, మధ్య తరగతి విద్యార్థులు కళాశాలలకు చెల్లించాల్సిన మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించేది. విద్యార్థులకు ఆర్థిక భరోసాగా నిలిచేలా వసతి దీవెన అందించేది. ఐటీఐ కోర్సు చదువుతున్న విద్యార్థులకు ఏడాదికి రూ.10 వేలు, పాలిటెక్నిక్, ఇతర డిప్లొమా కోర్సులకు రూ.15 వేలు, డిగ్రీ ఆపై కోర్సులు చదివే విద్యార్థులకు రూ.20 వేలు చొప్పున జగనన్న వసతి దీవెన పథకం కింద అందించేది. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు సైతం ఆర్థిక తోడ్పాటు అందించింది. జగనన్న విద్యా దీవెన పథకం కింద ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా అత్యున్నత యూనివర్సిటీలలో చదువుకునే వెసులుబాటు కల్పించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బకాయిలను విడుదల చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఫీజుల కోసం ఒత్తిడి

అనపర్తి, రాజానగరం నియోజకవర్గాలకు చెందిన దాదాపు 8 వేల మంది వరకు విద్యార్థులు వివిధ కళాశాలల్లో ఫీజు రీయంబర్స్‌మెంట్ పైనే ఆధారపడి ఉన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేయడం లేదు. దీంతో కళాశాలల్లో ఫీజులు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తున్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ వస్తే చెల్లిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. ఫీజులు చెల్లించాల్సిందేనని, ప్రభుత్వం ఇస్తే మీరే తీసుకోండని కరాఖండిగా చెబుతున్నట్లు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



నేను వీఎస్ఎం కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఫైనల్ ఇయర్‌కు సంబంధించి మూడు విడతల ఫీజు రీయంబర్స్‌మెంట్ రావాలి. ఫీజులు చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నాము. ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంట్ అందిస్తే ఫీజుల భారం తగ్గుతుందని ఎదురు చూస్తున్నాం. ఇంతవరకు దీనిపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి సకాలంలో ఫీజులు చెల్లించి విద్యార్థులను ఆదుకోవాలి.

వై.భాస్కర్, ఇంజినీరింగ్ విద్యార్థి, రంగంపేట మండలం.

ఎదురుచూపులే మిగిలాయి

నేను ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్నాను. నాకు మొదటి ఏడాది రావాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంటు ఇంకా రాలేదు. కళాశాల యాజమాన్యం ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేస్తోంది. ప్రభుత్వం ఫీజు రీయంబర్స్‌మెంటు వెంటనే అందించి మాలాంటి విద్యార్థులను ఆదుకోవాలి.

సన్నీ, బీటెక్ ఫస్ట్ ఇయర్ విద్యార్థి, రంగంపేట మండలం.

ప్రగడ రాంబాబుకు ఉత్తమ రైతు పురస్కారం


ఉత్తమ రైతు పురస్కారం అందుకుంటున్న రాంబాబు దంపతులు

రాజానగరం: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పత్తులను పండించి, జనావళికి అందిస్తున్న నరేంద్రపురానికి చెందిన అభ్యుదయ రైతు ప్రగడ రాంబాబుకు ఉత్తమ రైతు పురస్కారం లభించింది. సంక్రాంతి సంబరాలలో భాగంగా రైతు నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యడ్లపల్లి వెంకటేశ్వరరావు, విజ్ఞాన్ యూనివర్సిటీ ప్రతినిధి లావు రత్తయ్య ఆధ్వర్యంలో గుంటూరులో అభ్యుదయ రైతు పురస్కారాల ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు దంపతులను ఘనంగా సన్మానించి, ప్రశంసాపత్రం, జ్ఞాపిక బహూకరించారు. రాంబాబు మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల వినియోగంతో ప్రకృతి వ్యవసాయం చేయడం వలన రైతులకు, ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. పదేళ్లుగా తాను చేస్తున్న ఈ ప్రకృతి సాగు ఎంతో సంతృప్తిని ఇస్తోందన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం


బాధిత కుటుంబానికి సాయమందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజానగరం: చక్రద్వారబంధంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇంటిని కోల్పోయి, కట్టుబట్టలతో మిగిలిన కోనే వీరబాబు కుటుంబానికి జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ద్వారా సాయం అందించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా స్థానిక ఎంపీపీ మండారపు సీతారత్నం ద్వారా కొంత నగదును, బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, సర్పంచ్ కుందేటి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ గూడూరి ఇంట వైఎస్సార్ సీపీ నేతల సందడి


మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంతో డాక్టర్ గూడూరి దంపతులు, జక్కంపూడి గణేష్

రాజానగరం: రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఇంట సోమవారం ఆ పార్టీ నాయకులు సందడి చేశారు. దివాన్ చెరువులోని విజయభారతి చెస్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆస్పత్రి వద్ద ఉన్న డాక్టర్ గూడూరి ఇంటికి మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, ఆయన తనయుడు, ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరి, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ రాచ్చారు. వారికి డాక్టర్ గూడూరి దంపతులతో పాటు వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ స్వాగతం పలికారు. ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టి, తొలిసారిగా వచ్చిన ముద్రగడ గిరిని మర్యాద పూర్వకంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తోట రామకృష్ణ, దుర్గారావు, పెంటపాటి సాయి, గణేషుల రాంబాబు, రాపేటి పెద్ద తదితరులు పాల్గొన్నారు.

రేబిస్ సోకి యువకుడి మృతి


కాంద్రు హాసన్ (ఫైల్)

సీతానగరం: రేబిస్ సోకిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ రేలంగి శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. రఘుదేవపురానికి చెందిన కాంద్రు హాసన్ (17) కాతేరులోని తిరుమల కాలేజీలో ఇంటర్ సెంకడియర్ చదువుతున్నాడు. అతడు రేబిస్ లక్షణాలతో బాధపడుతుండడంతో ఆదివారం అర్ధరాత్రి 2 గంటలకు రఘుదేవపురం నుంచి కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ ప్రత్యేకమైన వార్డులో చికిత్స ప్రారంభించారు. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు చికిత్స పొందుతూ మృతి చెందాడు. తన కుమారుడిని నాలుగు నెలల క్రితం కుక్క కరిచిందని తండ్రి కాశీ విశ్వనాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు

రంగంపేట: సారా స్థావరాలపై దాడులు నిర్వహించి ఒకరిపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. సోమవారం ఆమె తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రమైన రంగంపేట గ్రామంలో దాడులు చేసి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన అంచూరి ప్రభాకరరావును అరెస్టు చేశారు. అతనిపై కేసు నమోదు చేసి పెద్దాపురం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు ఆమె చెప్పారు.

నాలుగు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నాలుగు అర్జీలను అధికారులు అందుకున్నారు. మునికూడలి ఆర్‌సీఎం చర్చిలో స్పీకర్ల కారణంగా సౌండ్ పొల్యూషన్ కలుగుతోందని అధిక సంఖ్యలో సంతకాలు పెట్టిన ఫిర్యాదు పత్రాన్ని మల్లి వీర్రాజు ఎంపీడీవో భారతికి అందించారు. అలాగే తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ రెవెన్యూకు సంబంధించిన మూడు అర్జీలు అందుకున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ గోపాల్ (సీఎం), మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ల తనిఖీ


కొంకుదురులో పింఛను తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

బిక్కవోలు: జిల్లా ఉన్నతాతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో మంచానికే పరిమితమై రూ.15వేలు పింఛను తీసుకుంటున్న లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య బృందం అధికారులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు వైద్యులతో పాటు పీహెచ్‌సీ పరిధిలోని వైద్యులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొంటున్నారు. బిక్కవోలు పీహెచ్‌సీ నుంచి డాక్టర్ దుర్గాదేవి, కొంకుదురు పీహెచ్‌సీ నుంచి విజయలక్ష్మి, ఆయా పంచాయతీ కార్యదర్శులు తనిఖీల్లో పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామికి లక్ష తులసి పూజ


ప్రత్యేక అలంకరణలో వేణుగోపాల స్వామి

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలోని వేణు గోపాలస్వామి ఆలయంలో సోమవారం లక్ష తులసి పూజ నిర్వహించారు. అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం లక్ష తులసి పూజలు చేశారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

పోలీస్ డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు: జిల్లా పోలీసు అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర డైరీని జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ అనసూరి శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్‌రెడ్డి, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రఘురాం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హరికథ సుందరకాండ గానం


అనపర్తిలో హరికథా గానం చేస్తున్న సింహాచలం శర్మ

పెదపూడి: అనపర్తి శారదా సంగీత కళాసమితి వారి 26వ త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో నాలుగో రోజు సోమవారం సుందరకాండ హరికథ ఆహూతులను అలరించింది. ప్రముఖ హరి కథకులు, వాచస్పతి డాక్టర్ ఎంవీ సింహాచలం శాస్త్రి హరికథా గానంతో శ్రోతలను ఆకట్టుకున్నారు. సీతాదేవిని వెదికేందుకు హనుమంతుణ్ని కాంచన లంకకు పంపించడం, హనుమంతుడు సీతాదేవిని గుర్తించడం, హనుమంతుడు లంకా వనాన్ని ధ్వంసం చేసే ఘట్టాలను కళ్లకు కట్టినట్లుగా వివరించారు. హరికథా గానానికి పాలపర్తి నాగేశ్వరరావు వయోలిన్, అనిల్‌కుమార్ మృదంగ సహకారాన్ని అందించారు. మార్నేళ్ల గంగ రాజుశర్మ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

254 మందికి వైద్యసేవలు


శిబిరంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రమేష్ బాబు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో రామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం సాధారణ, కంటి వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు రాయుడు శ్రీనివాస్, సత్యం రమేష్ బాబు 254 మందికి వైద్యసేవలు అందించారు. వారిలో ఆరుగురికి క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి, వారిని ఉచిత ఆపరేషన్ల కోసం ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, యన్నమని వెంకట నారాయణ, గద్దె బ్రహ్మన్న, విమలాదేవి, కుసుమ కుమారి, కె. శ్రీనివాసరావు, చంటిబాబు పాల్గొన్నారు.

ధాత్రి ట్రస్టు సేవలు అభినందనీయం

అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి


కరకుదురులో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి, తదితరులు

పెదపూడి: తన కుమారుడు స్వర్గీయ సబ్బెళ్ల సురేష్‌రెడ్డి మృతి తర్వాత ట్రస్ట్ ఏర్పాటు చేసి అతని స్నేహితులు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. పెదపూడి మండలం కరకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్వర్గీయ సబ్బెళ్ల సురేష్‌రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ధాత్రి ద్వారా పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను సోమవారం పంపిణీ చేశారు. ముందుగా సురేష్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ తన కుమారుడు సురేష్‌రెడ్డి మరణం తన కుటుంబానికి పూడ్చలేని లోటని అయితే మంచి వ్యక్తిత్వం కలిగిన యువకులను స్నేహితులుగా పొందడం అతని అదృష్టమన్నారు. హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఉండ్రు సత్యనారాయణ మాట్లాడుతూ సబ్బెళ్ల సురేష్‌రెడ్డి సేవాభావం కలిగిన యువకుడని కొనియాడారు. కార్యక్రమంలో ధాత్రి ట్రస్ట్ ప్రత్యేక అతిథి నల్లమిల్లి వెంకటరెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి చింతా ప్రభాకర్‌రెడ్డి , సర్పంచి ఉండ్రు చంద్రకళ, పాఠశాల హెచ్ఎం జీవీఎల్.కాత్యాయని, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి వాసంశెట్టి మాధవ, మాజీ సర్పంచ్ మేకా రామకృష్ణ, నియోజకవర్గ ఎస్సీ సెల్ కార్యదర్శి మందపల్లి బుల్లి రాజు, ముప్పిడి సత్యనారాయణ, విప్పర్తి సుధాకర్, ఎరుబండి రమణ, వేణుగోపాలస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ యెండ్రు సుబ్బారావు, వల్లూరి పట్టాబి, అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెదరాయవరంలో పారిశుధ్య పనులు


వాటర్ ట్యాంక్‌కు రంగులు వేస్తున్న కార్మికులు

రంగంపేట: మండలంలోని పెదరాయవరంలో పారిశుధ్య పనులు చేపట్టినట్టు గ్రామ సర్పంచ్ బరగటి సుజాత సోమవారం తెలిపారు. గ్రామంలోని మురుగునీటి కాలువల్లోని షిల్టు తొలగింపు, సీసీ డ్రెయిన్ల శుభ్రత, వీధిలైట్ల మరమ్మతులు, మంచినీటి ట్యాంకుల క్లీనింగ్ వంటి కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు.

గౌరవం వేతనం కోసం ఎదురు చూపులు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు మండల పరిషత్‌లో ఏడాది కాలం నుంచి ఎంపీటీసీ సభ్యులు గౌరవం వేతనం కోసం ఎదురు చూస్తున్నారు. 2023 సెప్టెంబర్ నుంచి అక్టోబర్ 2024 వరకు గౌరవం వేతనం బిల్లు పెట్టారు. మిగిలిన నెలలకు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో బిల్లు మంజూరు కాలేదు. త్వరలోనే వేతనాలు అందుతాయని ఎండీపీవో శ్రీనివాస్ తెలిపారు.

9న మాలల ఐక్య సమావేశం


రాజానగరం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వెనుకనున్న జగనన్న కాలనీలో ఈ నెల 9న మాలల ఐక్య సమావేశం జరుగుతుందని నిర్వాహకులు మేకల లక్ష్మీపతిరావు, ముప్పిడి శ్రీను తెలిపారు. ఈ సమావేశానికి మాలలందరూ తరలిరావాలని కోరారు. ఎస్సీ వర్గీకరణతో పాటు ఇటీవల చోటుచేసుకున్న పలు అంశాలపై చర్చించి, కార్యాచరణను నిర్ణయిస్తామన్నారు.

వలంటీర్లను కొనసాగించాలి


ముడే సింధూదివ్య

మధురపూడి: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లను కొనసాగించాలని కోటికేశవరం సర్పంచ్ ముడే సింధూదివ్య డిమాండ్ చేశారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ వలంటీర్ల గౌరవ వేతనాన్ని నెలకు రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక కుంటిసాకులు చెప్పడం సరికాదన్నారు. వారిని విధుల్లోకి తీసుకుంటే న్యాయపరమైన సమస్యలు వస్తాయనడం అన్యాయమన్నారు.

ఐదుగురు నిందితులకు రిమాండ్


రాజంపేట కేసులో నిందితులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సత్య కిషోర్

సీతానగరం: మండలంలోని రాజంపేటలో గత నెల 31 రాత్రి జరిగిన ఘర్షణకు సంబంధించి ఐదుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్ విధించారని ఎస్సై డి.రామ్ కుమార్ తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ఈ కేసులో మునికూడలికి చెందిన కప్పల జయసూర్య, మురల అనిల్ దేవ, రాచపల్లి నారాయణ మూర్తి, మార్పు ప్రేమ్ కుమార్, జాలిమూడికి చెందిన కర్ర చందును సోమవారం ఉదయం అరెస్ట్ చేశామన్నారు. వారికి కోరుకొండ సీఐ సత్య కిషోర్ కౌన్సెలింగ్ ఇచ్చారన్నారు. అనంతరం రాజమహేంద్రవరం 7వ అదనపు జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు.